సాక్షి
అనకాపల్లి
సోమవారం । 28 । జూలై । 2025



రసవత్తరంగా తైక్వాండో పోటీలు

జిల్లా స్థాయి తైక్వాండో చాపియన్‌షిప్ పోటీలు యలమంచిలిలో రసవత్తరంగా జరిగాయి. 100 మందికి పైగా పాల్గొన్నారు. 8లో



యోగాసన పోటీలు

పరవాడ: అనకాపల్లి యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు ఆదివారం ఘనంగా జరిగాయి.



ముగిసిన ఆడిట్

సబ్బవరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల ఉపకార వేతనాలు, సీఎస్సార్ నిధుల ఆడిట్‌పై ఆర్జేడీ సంతృప్తి వ్యక్తం చేశారు.

న్యూస్‌రీల్

నూకాంబిక సన్నిధిలో క్రికెటర్ నితీష్‌కుమార్‌రెడ్డి



నూకాంబిక అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకుంటున్న క్రికెటర్ నితీష్‌కుమార్‌రెడ్డి

అనకాపల్లి: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు నూకాంబిక అమ్మవారిని భారత్ క్రికెటర్ నితీష్‌కుమార్ రెడ్డి ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకొన్నారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను ఆయనకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా నితీష్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. గాజువాక వాస్తవ్యుడనైన తనకు నూకాంబిక అమ్మవారంటే ఎంతో నమ్మకమని, కోరిక నెరవేరిన వెంటనే అమ్మను దర్శించుకోవడం ఆనవాయితీ అని చెప్పారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తుమ్మపాల: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, మున్సిపల్, డివిజనల్ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. అర్జీలు, ఫిర్యాదుల నమోదుకు అనివార్య కారణాల వల్ల ప్రభుత్వ కార్యాలయాలకు రాలేనివారు తమ వినతులను ఆన్‌లైన్ ద్వారా meekosam.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు ఆమె తెలిపారు. టోల్ ఫ్రీ నెం.1100కు కాల్ చేసి అర్జీల స్థితిని తెలుసుకోవచ్చన్నారు.

తగ్గేదేలే..



రసవత్తరంగా పరుగు పోటీ

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర యూనివర్సిటీ గ్రౌండ్స్‌లో ఆదివారం జరిగిన అంతర జిల్లాల పారా అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక క్రీడా స్ఫూర్తికి వేదికైంది. జూనియర్, సబ్-జూనియర్ విభాగాల్లో దాదాపు 70 మంది దివ్యాంగ బాలబాలికలు తమ అసాధారణ ప్రతిభను ప్రదర్శించారు. ముఖ్యంగా 11-13 అంశాల పరుగు విభాగంలో సహాయకుల తోడుతో ట్రాక్‌లో పరుగెత్తుతూ 'తగ్గేదేలే' అంటూ వారు చూపిన సంకల్పం అందరినీ ఆకట్టుకుంది. ఫీల్డ్ ఈవెంట్లలో, ముఖ్యంగా త్రోస్ అంశాల్లో కూడా అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. బధిరులు, మేధో వైకల్యం గల బాలబాలికలు సైతం ఎంతో ఉత్సాహంగా ఈ పోటీలలో పాలుపంచుకున్నారు.

'వీరమల్లు'కు రూల్స్ వర్తించవా?

- రోడ్డుకు అడ్డుగా పవన్ కల్యాణ్ కటౌట్




రామచంద్ర థియేటర్ జంక్షన్‌లో రోడ్‌కు అడ్డుగా నిలిచి ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కటౌట్ ట్రాలీ బండి

అనకాపల్లి టౌన్: పట్టణంలోని రామచంద్ర థియేటర్ జంక్షన్‌లో హరిహర వీర మల్లు సినిమా రిలీజ్ సందర్భంగా అభిమానులు సినీ హీరో, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కటౌట్‌తో ఏర్పాటు చేసిన ట్రాలీ బండి రోడ్డుకు అడ్డంగా ఉంది. దీనిని ఈ నెల 24న సినిమా రిలీజ్ సందర్భంగా ఊరేగింపుతో తీసుకువచ్చి వదిలేశారు. ఐదు రోజులుగా రోడ్డుకు అడ్డుగా ఉన్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై ఈ కటౌట్ వల్ల అటువైపుగా వెళ్లే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే సెంటర్‌లో నిత్యం పండ్ల బళ్లు పెట్టుకొని పలువురు చిరువ్యాపారులు జీవనోపాధి పొందుతుంటారు. సామాన్యుడిపై జులుం ప్రదర్శించే ట్రాఫిక్ పోలీసులు రోడ్డుకు అడ్డుగా అభిమానులు ఏర్పాటు చేసిన వాహనాన్ని ఎందుకు తొలగించడం లేదని జనం విమర్శిస్తున్నారు.

వైఎస్సార్ విగ్రహం పాక్షిక ధ్వంసం

- ఆవేదన చెందిన అభిమానులు
- వెంటనే విగ్రహానికి మరమ్మతులు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



దెబ్బతిన్న వైఎస్సార్ విగ్రహం కుడి కన్ను ప్రాంతం



పట్టణ సీఐ విజయకుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న, జానకీరామరాజు

అనకాపల్లి: జాతీయ రహదారిపై కొత్తూరు పంచాయతీ పరిధిలోని ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్ వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహం దుండగుల దాడిలో పాక్షికంగా ధ్వంసమైంది. శనివారం అర్ధరాత్రి సమయంలో వైఎస్సార్ విగ్రహం కుడి కన్నును పాక్షికంగా పగలగొట్టారు. విషయం తెలుసుకున్న కొత్తూరు పంచాయతీ సర్పంచ్ సప్పారపు లక్ష్మీ ప్రసన్న, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు ఆదివారం ఉదయం విగ్రహం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా జానకీరామరాజు మాట్లాడుతూ.. వైఎస్సార్ మరణానంతరం కొత్తూరు ప్రజలు 2010లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, ఇన్నాళ్ల తర్వాత స్థానికుల మనోభావాలు దెబ్బతినే విధంగా విగ్రహాన్ని ధ్వంసం చేయడం అన్యాయమన్నారు. విగ్రహాలను కూల్చే సంస్కృతి అనకాపల్లి నియోజకవర్గంలో లేదని, ఇందుకు కారకులైన వ్యక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ సప్పారపు లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ 2010 సెప్టెంబర్ 2న వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, ఆయన అభిమానుల మనోభావాలను దెబ్బతీయాలనుకోవడం సరికాదన్నారు. వెంటనే విగ్రహానికి మరమ్మతులు చేపట్టి, నాయకులు పూలమాలలు వేసి వైఎస్సార్‌కు నివాళులర్పించారు. అనంతరం విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పార్టీ నాయకులు పట్టణ సీఐ టి.వి.విజయకుమార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, 80వ వార్డు ఇన్‌చార్జ్ కె.ఎం.నాయుడు, నూకాంబిక అమ్మవారి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, కొత్తూరు ఎంపీటీసీ ముదుగుతి సంతోష్‌కుమారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

కొత్తూరు పంచాయతీ ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్ వద్ద వైఎస్సార్ విగ్రహం పాక్షికంగా దెబ్బతిన్న ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ టి.వి.విజయకుమార్, ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. వారు ఘటనా స్థలాన్ని సందర్శించి, సమీపంలోని సీసీ పుటేజీ పరిశీలించారు. ఉల్లింగల శ్రీను, ఒక మైనర్ మద్యం తాగిన మైకంలో గొడవ పడ్డారని, మైనర్ ఉల్లింగల శ్రీనుపై రాయి విసరడంతో వైఎస్సార్ విగ్రహానికి తగిలి పెచ్చులు ఊడిపోయిందని సీఐ టి.వి.విజయకుమార్ చెప్పారు. వీరిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

తాండవలో జాడ లేని చేపపిల్లల ఉత్పత్తి 8లో

ఏపీఐఐసీ భూముల్లో కూటమి దోపిడీ.!

- రాత్రి పూట యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు
- ప్రతి లారీ లోడు నుంచి రూ.1000 వసూలు చేస్తున్న ఓ సర్పంచ్
- అటువైపు కన్నెత్తి చూడని అధికారులు



చందనాడ సమీపంలో గ్రావెల్ తవ్వకాలు జరిపిన ఏపీఐఐసీ భూములు

నక్కపల్లి: విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణంలో భాగంగా కంపెనీల కోసం ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో గ్రావెల్ దందా యథేచ్ఛగా సాగుతోంది. కూటమి నాయకుల దోపిడీకి అడ్డు అదుపూ లేకుండా పోతోంది. ఈ దందా వెనుక నిర్వాసిత గ్రామాల్లోని ఓ సర్పంచ్ కీలక పాత్ర పోషిస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ మద్దతుతో గెలిచి ఎన్నికల ముందు టీడీపీలో చేరిన ఈ సర్పంచ్ దగ్గరుండి ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. లారీ గ్రావెల్ లోడుకు రూ.1000 చొప్పున సర్పంచ్ వసూలు చేస్తున్నట్టు సమాచారం. ఇలా వసూలు చేసిన మొత్తంలో సగం తనకి, మిగతా సగం మండల స్థాయి నాయకుడికి ఇస్తున్నానని ప్రచారం కూడా చేస్తున్నాడని ఆయా గ్రామాల్లో చెప్పుకుంటున్నారు.

విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ప్రభుత్వం చందనాడ, అమలాపురం, వేంపాడు, డీఎల్‌పురం, రాజయ్యపేట గ్రామాల్లో వేలాది ఎకరాలు సేకరించింది. ఈ భూముల్లో విలువైన ఖనిజ సంపద ఉంది. సముద్రపు ఇసుకతో పాట, నాణ్యమైన గ్రావెల్ లభిస్తోంది. మంచి ధర లభించే గ్రావెల్ కొండలు సైతం ఉన్నాయి. ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో బల్క్ డ్రగ్ పార్క్ పనులు చేపట్టారు. దీని కోసం పరిహారం చెల్లించిన భూముల నుంచి గ్రావెల్ తవ్వుకుని రోడ్డు పనుల కోసం వినియోగిస్తున్నారు. దీన్ని ఆసరాగా తీసుకుని కూటమిలో ఉన్న సర్పంచ్ తమ గ్రామానికి పక్కనే ఉన్న చందనాడ సర్వే నంబరు 83లో ఉన్న గ్రావెల్‌ను రోజూ పొక్లెయిన్ల సాయంతో తవ్వించి పృథ్వీ అనే కాంట్రాక్ట్ సంస్థకు తరలిస్తున్నారు. భారీ టిప్పర్లతో సమీపంలో ఉన్న కంపెనీలకు, ఏపీఐఐసీలో రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు విక్రయిస్తూ కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న చందనాడ గ్రామస్తులు తవ్వకాలను అడ్డుకున్నారు. దీంతో రెండు రోజుల పాటు తవ్వకాలు ఆపేశారు. ప్రస్తుతం యథావిధిగా తవ్వకాలు సాగుతున్నట్టు తెలిసింది.

నిత్యం పర్యటిస్తున్నా.. కనిపించని తవ్వకాలు

నిత్యం వందలాది లారీల్లో గ్రావెల్‌ను తరలించేస్తున్నా ఏపీఐఐసీ అధికారులు, మైనింగ్, రెవెన్యూ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. మండల స్థాయి అధికారులకు ఎవరైనా ఫిర్యాదు చేస్తే అధికార పార్టీ నాయకులకు ఆ సమాచారం చేరవేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏపీఐఐసీ భూముల్లో జరుగుతున్న పనులను పర్యవేక్షించడం, అదనపు భూసేకరణ కోసం ప్రతిరోజు అధికారులు ఈ ప్రాంతాల్లో పర్యటిస్తున్నా ఈ అక్రమ తవ్వకాలు కనిపించకపోవడం గమనార్హం. ఒకరిద్దరు అధికారులు టిప్పర్లను కొనుగోలు చేసి ఏపీఐఐసీ భూముల్లో జరుగుతున్న పనుల వద్ద గ్రావెల్ తరలింపునకు లీజుకు ఇచ్చినట్టు సమాచారం. కారిడార్ భూముల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలను అడ్డుకోకపోతే ఆయా ప్రాంతాలకు తామే వెళ్లి అడ్డుకుంటామని మరోవైపు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వీసం రామకృష్ణ హెచ్చరించారు. పరిహారం చెల్లించిన భూములను ఏపీఐఐసీ స్వాధీనం చేసుకుని కాపలా పెట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇప్పటికైనా గ్రావెల్ దందాకు అడ్డుకట్ట వేయాలని నిర్వాసిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు జీతాలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఎస్.రాయవరం: బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతాలు తక్షణమే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.కె.ఎల్.ఎ స్.ధర్మారావు, ఎస్. దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. అడ్డురోడ్డులో ఆదివారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. బదిలీలు నిర్వహించి నెల రోజులు గడుస్తున్నా జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. జూలై నెల జీతాలు కూడా ఇదే వంకతో ఆలస్యం చేసే అవకాశం ఉందన్నారు. వేలాదిమంది ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు. బదిలీ అయినా రిలీవర్ లేరన్న వంకతో ఉపాధ్యాయులను అక్కడే ఉంచేస్తున్నారని, వారిని వెంటనే ట్రాన్స్‌ఫర్ అయిన స్థానాలకు పంపాలన్నారు.

డీసీహెచ్ఎస్ సహా 22 మంది డాక్టర్లు, నర్సులపై విచారణ

- అవకతవకలు, సేవల లోపంపై ఏసీబీ నివేదిక
- శీఘ్ర విచారణకు ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశం

సాక్షి, అనకాపల్లి: గతంలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో అక్రమాలకు పాల్పడిన 22 మంది వైద్యులు, నర్సులపై శీఘ్రగతిన విచారణ జరపాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. అమరావతిలో వైద్యశాఖ ముఖ్య అధికారులతో మంత్రి ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ఆస్పత్రి నిర్వహణపై అవినీతి నిరోధక శాఖ సమర్పించిన నివేదిక చర్చకు వచ్చింది. ఆస్పత్రి నిర్వహణపై ఆరోపణలు రావడంతో 2020లో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించి నివేదిక ఇచ్చారు. ఆ నివేదిక మేరకు అప్పటి జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్), తొమ్మిది మంది వైద్యులు, 12 మంది హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సుల అక్రమాలపై విచారణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. లైసెన్స్ లేకుండా క్యాంటీన్ నిర్వహణ, భోజనం అందించాల్సిన రోగుల వివరాల్ని తెలపకపోవడం, ఆహార సరఫరా నాణ్యత పట్ల నిర్లక్ష్యం, నియమాలకు భిన్నంగా సివిల్ పనుల్ని కట్టబెట్టడం, వైద్యులు, ఇతర సిబ్బంది హాజరును నియంత్రించకపోవడం తదితర వైఫల్యాలపై అప్పటి డీసీహెచ్ఎస్‌పై చర్యలు తీసుకోవాలని ఏసీబీ అధికారులు ఈ ఏడాది జూన్‌లో ఇచ్చిన నివేదికలో సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపిన 9 మంది వైద్యులు, 12 మంది హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులపై కూడా క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని ఏసీబీ సిఫారసు చేసింది. ఈ అంశాలతోపాటు రూ.74,000 మేరకు వాహన ఇంధనం వినియోగంలో తప్పుడు లెక్కలు చూపిన డ్రైవర్, డ్రెస్సింగ్ పనులు చేసిన కాంట్రాక్టు శానిటేషన్ వర్కర్‌పై కూడా క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

కష్టపడినా... కడుపు నిండదు

- దీనావస్థలో ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు
- చాలీచాలని జీతంతో నిత్యం వెతలే..
- నెలకు రూ.16 వేలు వేతనమని చెప్పి.. రూ.9 వేలే ఇస్తున్న కాంట్రాక్టర్
- 3 నెలలుగా వేతన బకాయిలు
- 165 మంది కార్మికుల ఆకలి కేకలు



అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పనులు చేస్తున్న పారిశుధ్య కార్మికురాలు



కె.కోటపాడు సీహెచ్‌సీలో శనివారం ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు



జీతాలు సకాలంలో ఇవ్వాలని డీసీహెచ్ఎస్‌కు కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల వినతిపత్రం (ఫైల్)

సాక్షి, అనకాపల్లి: ఇంట్లో ఎవరికైనా అనారోగ్యం సోకి మంచాన పడితే సొంత మనుషులే సేవ చేయలేని రోజులివి. అన్నీ మంచం మీదే చేయాల్సి వస్తే మరింత యాతన. అలాంటి రోగులను కూడా సొంత మనుషుల కంటే మిన్నగా చూసుకునే బడుగుజీవులు వారు. బతుకుతెరువు కోసం దుర్భరమైన.. క్లిష్టమైన వృత్తిలో కొనసాగుతున్నారు. వారికిచ్చే వేతనాలు అంతంతమాత్రమే. ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులు, రోగుల సంరక్షకుల దుస్థితి ఇది.

విధులకు తగ్గ వేతనం ఏదీ?

రోగులకు అమ్మలా అన్నం తినిపిస్తారు. వేళకు మందులిస్తారు. దగ్గరుండి బాత్రూమ్‌కు తీసుకెళ్తారు. రోగులు వాంతులు.. మల మూత్రాదులు చేస్తే శుభ్రం చేస్తారు. ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచుతారు. వాడి పడేసిన సిరంజిలు, ఇంజక్షన్లు తదితర ప్రమాదకరమైన బయో వ్యర్థాలు బయటికి తరలిస్తారు. ఇలా నెలలో 30 రోజులూ గైర్హాజరీ లేకుండా పనిచేస్తే.. వారికిచ్చే వేతనం కోతలు పోనూ కేవలం తొమ్మిది.. పది వేల రూపాయలు. ఇలా జిల్లా ఆస్పత్రి, ఒక ఏరియా ఆస్పత్రి, ఆరు సీహెచ్‌సీలలో పని చేసే 165 కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలు జీతాలు లేక పలు ఇబ్బందులకు లోనవుతున్నాయి. పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నా వారి జీతంలో సగం కూడా అందడం లేదు.

గత ప్రభుత్వంలో ఇచ్చిన హామీ ఇలా..

ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2021లో టెండర్లు పిలిచినప్పుడు నెలకు రూ.16 వేలు (ఈఎస్ఐ, పీఎఫ్ పోను) ఇచ్చేందుకు కాంట్రాక్టర్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. కానీ ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రి, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో రూ.10 వేలు మాత్రమే ఇస్తున్నాడు. యలమంచిలి, నక్కపల్లి, కోటవురట్ల, మాడుగుల, చోడవరం, కె.కోటపాడు సీహెచ్‌సీలలో అయితే ఇచ్చేది రూ.9 వేలే. అది కూడా మూడు నెలల జీతాలు నిలిపివేశారు. కార్మికులు సమ్మె చేస్తే వెయ్యి పెంచుతున్నారు. మిగిలిన రూ.6 వేలు కాంట్రాక్టర్ జేబులోకి వెళ్తున్నాయనే ఆరోపణలు. ఈ విషయాన్ని కార్మిక సంఘాలు కలెక్టర్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా స్పందన లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈఎస్ఐ, పీఎఫ్ విషయానికొస్తే 12 శాతం సిబ్బంది జీతానికి యజమాని 12 శాతం కలిపి పీఎఫ్‌కు జమ చేయాలి. కానీ మొత్తం 24 శాతం సిబ్బంది నుంచే కలెక్ట్ చేసినా.. పీఎఫ్‌కి సక్రమంగా కట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనకాపల్లి జిల్లా ఆస్పత్రిలో 30 మంది పారిశుధ్య కార్మికులు, 25 మంది సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తున్నారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో 20 మంది పారిశుధ్య కార్మికులు, 10 మంది సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు. ఆరు సీహెచ్‌సీలలో కాంట్రాక్ట్ కార్మికులు 80 మంది పనిచేస్తున్నారు.

కలెక్టర్ దృష్టి సారించాలి



ప్రభుత్వం మారినప్పుడల్లా కార్మికులను తొలగించే ప్రక్రియను మానుకోవాలి. నెల మొత్తం సెలవు లేకుండా పనిచేస్తే రూ.10 వేల జీతం వస్తుంది. అది కూడా మూడు నెలలకొకసారి ఇస్తున్నారు. డ్యూటీ సమయం కన్నా.. అదనంగా మూడు నుంచి నాలుగు గంటల పాటు డ్యూటీ చేయించుకుంటున్నారు. టాయిలెట్ల క్లీనింగ్‌కు ఫినైల్, తుడవడానికి చీపుళ్లు కూడా అరకొరగానే ఇస్తున్నారు. ఎవరైనా అడిగితే రాజకీయ నాయకుల పేర్లతో వారిని తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారు. కొంతమందిని ఇప్పటికే తొలగించారు. ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్‌గా ఉన్న కలెక్టర్ గారు ఆస్పత్రిపై దృష్టి సారించాలి.

– కోన లక్ష్మణ్, ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

బహిరంగంగా బరితెగింపు

- పరదా మాటున చకచకా నిర్మాణం
- బ్రిటిష్ సైనికాధికారుల సమాధుల పరిరక్షణకు విఘాతం
- కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం



పరదా మాటున పక్కా దుకాణాల నిర్మాణం



బ్రిటిష్ సైనికాధికారుల సమాధుల స్థలాన్ని పరిశీలించిన న్యాయమూర్తి (ఫైల్)

నర్సీపట్నం: పట్టణం నడిబొడ్డున ఉన్న బ్రిటిష్ సైనికాధికారుల సమాధుల ప్రదేశంలో మెయిన్ రోడ్డు ను అనుకుని బహిరంగంగా అక్రమ నిర్మాణాలు సాగిస్తున్నారు. ఇది పురావస్తు శాఖకు చెందిన భూమి అంటూ.. ప్రధాన రోడ్డు వైపు కట్టిన ఆకుపచ్చని మ్యాట్‌ని శనివారం మున్సిపల్, రెవెన్యూ అధికారులు తొలగించారు. అయితే యథావిధిగా మళ్లీ పరదాను కట్టి ఆదివారం పక్కా భవనాల నిర్మాణం కోసం పిల్లర్స్ వేయటం మొదలు పెట్టారు. ఇది పురావస్తుశాఖ స్థలం అంటూ హడావుడి చేసిన అధికారులెవరూ ఇటు వైపు కన్నెత్తి చూడలేదు. వాస్తవంగా ప్రస్తుతం నిర్మాణా లు చేస్తున్న వారంతా మూడు దశాబ్దాలకు పైగా ఈ ప్రదేశంలో దుకాణాలు నిర్మించుకుని జీవనం సాగించేవారు. ప్రధాన రోడ్డు విస్తరణ సమయంలో వీరంతా స్వచ్ఛందంగా దుకాణాలను తొలగించగా, ఇదే స్థలంలో ఉన్న మరో దుకాణదారుడు ఆర్థిక స్తోమతు ఉండడంతో దుకాణం తొలగించకుండా కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. వివిధ సాంకేతిక కారణాల వల్ల అప్పట్లో రోడ్డు విస్తరణ పూర్తికాలేదు.

పరిరక్షించాలని పిటిషన్

అల్లూరి సీతారామరాజు పోరాటానికి చిహ్నంగా ఉన్న బ్రిటిష్ సైనికాధికారులు లియోనెల్ నెవెల్లీ హైటర్, క్రిస్టోఫర్ విలియం స్కాట్ కవర్ట్‌ల సమాధుల స్థలాన్ని పరిరక్షించాలని అల్లూరి సీతారామరాజు స్మారక కమిటీ కన్వీనర్ పి.వి.సత్యనారాయణరావు కోర్టులో పిటిషన్ వేశారు. స్పందించిన సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్ ఖాన్ అధికారులతో కలిసి బ్రిటిష్ సైనికాధికారుల సమాధుల స్థలాన్ని ఈ నెల 10న క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. చాలా వరకు స్థలం అక్రమణకు గురైందని, పురావస్తుశాఖకు చెందినదిగా 2011లోనే నోటిఫై చేసినా, స్థలాల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పిటిషనర్ న్యాయమూర్తి దృష్టికి తీసుకువెళ్లారు. నిధులు లేకపోవటం వల్ల పరిరక్షణ చర్యలు తీసుకోలేకపోయామని పురావస్తుశాఖ సహాయ సంచాలకులు ఫల్గుణరావు న్యాయమూర్తికి వివరించారు. స్థలం అన్యాక్రాంతం కాకుండా తాత్కాలికంగా రక్షణ చర్యలైనా చేపట్టాలని జడ్జి మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. ఇది జరిగిన రెండు వారాలకు దుకాణదారులు స్థలం చుట్టూ గ్రీన్ మ్యాట్ కట్టి పక్కా దుకాణాల నిర్మాణానికి పూనుకున్నారు. న్యాయమూర్తి ముందు స్థల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్న పురావస్తు, రెవెన్యూ, పురపాలక శాఖ అధికారులు ఆదివారం సెలవు దినం పేరుతో మొహం చాటేశారు. అనుమతులు లేకుండా ఏ చిన్న నిర్మాణం చేపట్టినా ఇట్టే వాలిపోయే టౌన్ ప్లానింగ్ అధికారులు సైతం కానరాలేదు.

క్లుప్తంగా

111.60 మీటర్లకు రైవాడ నీటిమట్టం



నీటి నిల్వలతో కళకళలాడుతున్న రైవాడ జలాశయం

దేవరాపల్లి: ఇటీవల **కురుస్తున్న వర్షాలకు** రైవాడ జలాశయం నీటిమట్టం క్రమేపి పెరుగుతుంది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 111.60 మీటర్లకు చేరుకుంది. ప్రస్తుతం జలాశయంలోకి 200 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. జలాశయం నుంచి జీవీఎంసీ తాగునీరు నిమిత్తం 50 క్యూసెక్కుల నీరు విడుదల కొనసాగుతుంది. జలాశయంలో సమృద్ధిగా నీటి నిల్వలు ఉండడంతో నిండుకుండలా కళకళలాడుతుంది. ఈ ఏడాది ఖరీఫ్ పంటల సాగుకు నీటికి ఢోకా ఉండబోదని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. కాగా ప్రస్తుతం రైవాడ ఆయుకట్టు భూముల్లో ఖరీఫ్ వరి సాగుకు దమ్ములు ముమ్మరంగా సాగుతున్నాయి. ఖరీఫ్‌కు ఈ నెల 29న కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా నీటిని విడుదల చేసేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు.

జిల్లా హెచ్‌ఎంల సంఘం నూతన కార్యవర్గం



జిల్లా హెచ్‌ఎంల సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

అనకాపల్లి : జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షునిగా ఎ.వి.హెచ్.శాస్త్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో సంఘం ప్రధాన కార్యదర్శిగా ఆళ్ల శేఖర్, కోశాధికారిగా నాగేంద్ర, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎం.ఎస్.ప్రసాద్, కె.ఆర్.ఎస్.నాయుడు, ఎ.వరహామూర్తి ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకుడిగా సంఘం రాష్ట్ర కోశాధికారి సి.వి.వి.సత్యనారాయణ వ్యవహరించారు. పై కమిటీ ఎన్నిక రెండు సంవత్సరాలు ఉంటుందని ఎన్నికల అధికారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఉప విద్యాశాఖ అధికారి పొన్నాడ అప్పారావు, పరీక్షల విభాగం సహాయ కమిషనర్ పి.శ్రీధర్‌రెడ్డి, జిల్లా కామన్ పరీక్షల బోర్డు చైర్మన్‌లు సిహెచ్.సత్యనారాయణ, సాయిబాబా పాల్గొన్నారు. అనంతరం 2024 జనవరి నుంచి ఈ ఏడాది జూన్ వరకూ 30 మంది హెచ్‌ఎంలు పదవీ విరమణ చేసిన హెచ్‌ఎంలను సంఘం సభ్యులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

తాండవలో జాడ లేని చేపపిల్లల ఉత్పత్తి



తాండవలో చేప పిల్లలు ఉత్పత్తి చేసే నీటి కుండీలు

- గతంలో ఏటా కోటి 50 లక్షల చేప పిల్లల ఉత్పత్తి
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సరఫరా
- నేడు శిథిలావస్థలో చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



గత ఏడాది తాండవ రిజర్వాయర్‌లో చేప పిల్లలు విడుదల చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

నాతవరం: ఉమ్మడి జిల్లాలోనే ఏకైక చేప పిల్లలు ఉత్పత్తి కేంద్రం తాండవలో ఈఏడాది చేప పిల్లలు ఉత్పత్తి జాడ కన్పించడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి ఏటా మత్స్యశాఖ ఆధ్వర్యంలో జూన్ నుంచి ఆగస్టు మూడు నెలల పాటు తాండవ ఉత్పత్తి కేంద్రంలో కోటి 50లక్షల వరకు ఉత్పత్తి చేయడం జరిగేది. ఈ కేంద్రంలో పెద్ద చేపలకు ఇంజక్షన్లు చేసి కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా వివిధ జాతుల చేప పిల్లలు కోటిన్నరకు పైగా ఉత్పత్తి చేసేవారు. వాటిని తాండవ రిజర్వాయరులో విడుదల చేసేవారు. తర్వాత జిల్లాలో కోనాం, రైవాడ, రవాణపల్లి, కళ్యాణపులోవ తదితర రిజర్వాయర్లకు చేప పిల్లలు సరఫరా చేసేవారు. వీటితో పాటు జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్లు కలిగి ఉన్న మత్స్య సహకార సంఘాలకు రాయితీపై సరఫరా చేసేవారు. మిగిలిన చేప పిల్లలను నర్సీపట్నంలో గల మత్స్యకార కార్యాలయం ప్రాంగణంలో గల నీటి కుండీలలో నిల్వ చేసేవారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రైవేటు వ్యక్తులకు చెరువులో పెంచుకునేందుకు చేప పిల్లలను విక్రయించేవారు. అంతటి ప్రాముఖ్యం కలిగిన తాండవ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. సిబ్బంది కొరత లేదా నిధుల సమస్య అనేది తెలియరాలేదు.

మండలంలో తాండవలో 1986లో చేప పిల్ల లు ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా జూన్, జూలై, ఆగస్టు నెలలో ప్రభుత్వం విధించిన లక్ష్యాన్ని అధిగమించి చేప పిల్లల ఉత్పత్తి చేసేవారు. గత ఏడాది ఈ కేంద్రంలో చేప పిల్లల ఉత్పత్తి జరగలేదు. దీంతో ఇతర జిల్లాలో 25 లక్షలు చేప పిల్లలు కొనుగోలు చేసి వాటిని కలెక్టరు విజయకృష్ణన్‌చేతుల మీదుగా తాండవ రిజర్వాయరులో విడుదల చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా తాండవ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం భవనం శిథిలావస్థకు చేరింది. నీటి కోసం ఏర్పాటు చేసిన బోరు వాడకపోవడంతో పిచ్చి మొక్కల మధ్యలో నిరుపయోగంగా దర్శనమిస్తోంది. సిబ్బంది అప్పుడప్పుడు మాత్రమే కార్యాలయాన్ని సందర్శించడంతో తలుపులు, కిటికీలు చెదలు పట్టి శిథిలమవుతున్నాయి.

తాండవలో తగ్గిన చేపల వేట

గతంతో పోల్చుకుంటే తాండవ రిజర్వాయరులో చేపలు వేట గణనీయంగా తగ్గిందని మత్స్యకారులు అంటున్నారు. తాండవ రిజర్వాయరులో చేపల వేటపై ఆధారపడి నాతవరం, గొలుగొండ, కొయ్యూరు మండలాలకు చెందిన 600 నుంచి 700 మధ్య కుటుంబాలకు పైగా మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. జాలారిపేట, అమ్మపేట, జోగుంపేట, పాగచెట్లపాలెం, సారిక మల్లవరం, ఆడాకుల అమ్మపేట, చోద్యం, తాండవ తదితర గ్రామాల్లో మత్స్యకారులు ఉన్నారు. వారంతా ప్రతి రోజు తాండవ రిజర్వాయరులో చేపలు వేటాడి జీవనం సాగిస్తుంటారు. గతంలో 5 నుంచి 25 కేజీల వరకు పెద్ద చేపలు పడేవి. ఇటీవల కాలంలో తాండవలో మచ్చుకైనా పెద్ద చేపల జాడ కన్పించడం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తాండవలో చిన్న చేపలు మాత్రమే దొరకడంతో వాటిని స్థానికంగా విక్రయిస్తున్నారు. గతంలో వలే చేపల వేట సాగకపోవడంతో మత్స్యకారులు నాగార్జున సాగర్ వంటి ప్రాంతాలకు వలసపోయారని చెబుతున్నారు. ఈ విషయంపై నర్సీపట్నం మత్స్యకార అధికారి నాగమణిని వివరణ కోరగా తాండవ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంపై దృష్టి సారించామన్నారు. తాండవ ప్రాజక్టు నుంచి నీరు కావాలని జేఈని అడిగామని త్వరలోనే చేప పిల్లలు ఉత్పత్తి చేస్తామన్నారు.

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణం



తాండవ చేప పిల్లలు ఉత్పత్తి కేంద్రంలో చేప పిల్లల ఉత్పత్తి గత ఏడాది జరగలేదు. ఈఏడాది నేటి వరకు అక్కడ ఏమీ కన్పించలేదు. కేవలం కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఈవిధంగా జరుగుతుంది. ఇక్కడ ఉత్పత్తి చేసిన పిల్లలు జిల్లా అంతంటా గతంలో సరఫరా చేసేవారు.. ప్రస్తుతం మనం ఇతర ప్రాంతాల్లో కొనుక్కునే పరిస్థితి వచ్చింది.

– సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీపీ

రైతులకు నీటి తీరువా నోటీసులు తగదు



పార్టీ నేతలతో కలసి నినదిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: నీటి తీరువా బకాయిలు చెల్లించాలని రైతులకు ప్రభుత్వం డిమాండ్ నోటీసులు పంపడం సరికాదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రైతులకు ప్రభుత్వం నుంచి వ్యవసాయ పెట్టుబడులకు ఎటువంటి సాయం అందక అవస్థలు పడుతుంటే రెవెన్యూ అధికారులు నీటి తీరువాలు చెల్లించాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆదివారం ఆయన మునగపాకలో పార్టీ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సాగునీటి వనరులు అధ్వానంగా ఉన్నా రైతులకు న్యాయం చేయకుండా వారిపై భారం పడేలా నీటి తీరువా చెల్లించాలంటూ నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా ఇంతవరకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయలేదన్నారు. ఆరు నెలల పాటు పంట పొలాలకు పుష్కలంగా నీరందించడం ద్వారా నీటి తీరువా వసూలు చేస్తుంటారన్నారు. అయితే మండలంలో అటువంటి పరిస్థితులు లేవన్నారు. సాగునీటి కాలువలు పలు చోట్ల అధ్వానంగా ఉన్నాయన్నారు. దీంతో సాగు నీరు పంటలకు అందే పరిస్థితులు లేవన్న విషయాన్ని అధికారులు గుర్తించాలన్నారు. నీటి తీరువా వసూళ్లకు సంబంధించి రైతులపై ఒత్తిడి తీసుకువస్తే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆడారి అచ్చియ్యనాయుడు, మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రసవత్తరంగా తైక్వాండో పోటీలు



పోటీల్లో తలపడుతున్న తైక్వాండో క్రీడాకారులు, పతకాలు సాధించిన క్రీడాకారులు

యలమంచిలి రూరల్ : పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన 5వ జిల్లా స్థాయి తైక్వాండో సబ్ జూనియర్, మినీ సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్ పోటీలు రసవత్తరంగా జరిగాయి. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 100 మందికి పైగా క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బాలుర విభాగంలో 12, బాలికల విభాగంలో 12 కేటగిరీల్లో నిర్వాహకులు పోటీలు నిర్వహించారు. పోటీల్లో స్పారింగ్, ఇండివిడ్యువల్ ప్యాటర్న్, పవర్ బ్రేకింగ్, సెల్ఫ్ డిఫెన్స్, స్పెషల్ టెక్నిక్స్ వంటి రకరకాల ఈవెంట్లలో క్రీడాకారుల సామర్థ్యాన్ని పరీక్షించారు. ఓ క్రీడలా కాకుండా పిల్లల్లో క్రమశిక్షణ, సమయస్ఫూర్తిని ప్రోత్సహించే విధంగా నిర్వహించిన ఈ పోటీలను పెద్ద ఎత్తున క్రీడాకారుల తల్లిదండ్రులు, స్థానిక క్రీడాకారులు వీక్షించారు. ఇలాంటి పోటీలు తైక్వాండో క్రీడ ప్రాధాన్యతను తెలియజేసేందుకు ఉపయోగపడతాయని అనకాపల్లి యూత్ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డి.హేమంత్‌కుమార్, డి. యశ్వంత్‌కుమార్ అభిప్రాయపడ్డారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించిన పోటీల్లో పలువురు క్రీడాకారులు తమ ప్రతిభను చూపి సత్తా చాటారు. పోటీల్లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు త్వరలో గుంటూరులో జరగనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారన్నారు. అంతకుముందు ఈ పోటీలను విశ్రాంత అధ్యాపకుడు ఆడారి పూరీ జగన్నాథం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తైక్వాండో పోటీల వల్ల పిల్లల్లో ఆత్మరక్షణ, ఆత్మస్థయిర్యం లాంటి మానసిక ధృఢత్వం పొందే అవకాశం ఉందని ఆయన అన్నారు. తైక్వాండో కేవలం మార్షల్ క్రీడే కాకుండా ఒలింపిక్ పోటీల్లో చోటు దక్కించుకుందన్నారు.

37 మందికి బంగారు పతకాలు

ఇండోర్ స్టేడియంలో జరిగిన తైక్వాండో పోటీల్లో 37 మంది బంగారు, 32 మంది రజతం, మరో 20 మంది కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులకు అతిథులు అభినందనలు తెలిపారు. జిల్లా జూడో అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కొండబాబు, కోచ్‌లు ఆలీ, మిథిలేష్, మణి, మోహన్, గణేష్, భాస్కర్ పోటీలను పర్యవేక్షించారు.

డి.యర్రవరంలో సినిమా షూటింగ్ సందడి



ఆలయంలో సినిమా షూటింగ్ ప్రారంభం

నాతవరం: మండలంలో డి.యర్రవరం గ్రామంలో గల నల్లకొండమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఆదివారం కొత్త సినిమా షూటింగ్ ప్రారంభించారు. డైరెక్టరు వై.ఎస్ రెడ్డి ఆధ్వర్యంలో చంద్ర హర్షిణి మూవీస్ బ్యానర్‌పై 'జాగా' అనే తెలుగు చలన చిత్రం ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి షూటింగ్ ప్రారంభించారు. పలు సన్నివేశాలు చిత్రీకరించారు. ములగపూడి ఎం.బెన్నవరం గ్రామాల్లో గల వ్యవసాయ భూములు, జీడిమామిడి తోటల్లో ఈ చిత్రంలో సర్పంచ్ పాత్ర వ్యవసాయదారుడి రైతులు మధ్య సంభాషణకు సంబంధించి పలు దృశ్యాలను చిత్రీకరించారు. చిత్ర ప్రధాన పాత్రధారులు ముమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, సాయిగణేష్‌లపై ఆలయంలో షూటింగ్ ప్రారంభించి తర్వాత పలు ప్రదేశాల్లో సన్నివేశాలు చిత్రీకరణ జరిపారు. సినిమా షూటింగ్ చూసేందుకు చుట్టు పక్కల గ్రామాలు అధిక సంఖ్యలో రావడంతో సందడి నెలకొంది. వెంకట పవన్ కుమార్, లవకుమార్, బుజ్జి తదితర చిత్ర బృందం పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న యుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వర్లు

అనకాపల్లి : ప్రభుత్వ ఉపాధ్యాయులను పి–4, కర్మయోగి యాప్‌ల నుంచి తొలగించి, విద్యార్థులకు బోధన వరకే పరిమితం చేయాలని బోధనేతర పనులను అప్పగించడం వల్ల విద్యా ప్రమాణాలు కుంటుపడతాయని యుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం యుటీఎఫ్ జిల్లా ముఖ్య నేతల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు విధులు నిర్వహించే గ్రామాల్లో కుటుంబాలను కేటాయించి, దత్తత తీసుకోమని చెప్పడం, బోధనేతర పనుల కిందికే వస్తుందన్నారు. పి–4 విధానంలో ఉపాధ్యాయులకు రెండేసి కుటుంబాలను, ప్రధానోపాధ్యాయులకు ఐదు కుటుంబాలను కేటాయించి దత్తత తీసుకోమని చెప్పడం వల్ల పనిభారం పెరిగి బోధనపై దృష్టి పెట్టలేరని అన్నారు. కర్మయోగి యాప్ ను ఉపాధ్యాయులపై బలవంతంగా రుద్దుతున్నారని, యాప్‌లో ఆన్‌లైన్ కోర్స్‌లో 56 వీడియోలు ప్రతి ఉపాధ్యాయుడు పూర్తి చేయాలని బలవంతం చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. జూన్ 12 నుంచి విద్యార్థులకు సరైన బోధన చేయకుండా నిర్బంధంగా ఉపాధ్యాయులతో యాప్‌ల నిర్వహణ చేస్తున్న విద్యాశాఖ అధికారులు తమ వైఖరిని విడనాడాలన్నారు. రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ జీతం మీద ఆధారపడి జీవిస్తున్న ఉపాధ్యాయులకు 2 మాసాల నుంచి జీతాలు రాకుండా చేసిన విద్యాశాఖాధికారులు వైఖరిని మార్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో యుటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.లక్ష్మి, గొంది చిన్నబ్బాయ్, సహాధ్యక్షులు రొంగలి అక్కునాయుడు, కార్యదర్శులు పొలిమేర చంద్రరావు, రమేష్ రావు, శేషుబాబు, సీనియర్ నాయకులు జి.కె.ఆర్ స్వామి, అలివేలు, హైమావతి, ఎల్లయ్య బాబు, మామిడి బాబూరావు, సలీం, రవి పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా



చేపలు, చికెన్ వ్యర్థాలతో పట్టుబడిన వాహనాలతో డ్రైవర్లు

అనకాపల్లి : స్థానిక జాతీయ రహదారి డైట్ కళాశాల వద్ద పట్టణ పోలీసులు ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా విశాఖ ఉమ్మడి జిల్లా నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు 5 బోలేరో వాహనాలలో చేపల మేత, చికెన్ వ్యర్థాలు రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. విశాఖలో ఎన్ఏడీ, అక్కయ్యపాలెం, ఇతర ప్రాంతాల నుంచి వ్యర్థాలను సేకరించి తీసుకువెళుతున్నారని పోలీసులు తెలిపారు. వాహన డ్రైవర్లు బడపాటి నాగబాబు, జయమంగళ సత్యనారాయణ, బుడుమూరు బాలాసుబ్రహ్మణ్యం, మేడిశెట్టి నూకరాజు, బద్ధి నాగ సత్యనారాయణలను అదుపులోనికి తీసుకుని అనకాపల్లి జోనల్ కమిషనర్ చక్రధర్‌కు అప్పగించారు. పట్టుకున్న వ్యర్థాలను విశాఖ కాపులుప్పాడలో డంపింగ్‌యార్డులో పూడ్చి, ప్రధాన కమిషనర్ ఆదేశాల మేరకు కేసులు నమోదు చేయడం జరుగుతుందని జోనల్ కమిషనర్ తెలిపారు.

సృష్టి రహస్యాలెన్నో..!

- ఐవీఎఫ్‌లో కలకలం
- పిల్లలు లేని దంపతులే లక్ష్యం
- భారీగా వసూళ్ల పర్వం
- లోపించిన వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణ
- వివాదాలకు కేంద్రబిందువుగా మారిన ఐవీఎఫ్ సెంటర్లు



సృష్టి ఫెర్టిలిటీ రీసెర్చ్ సెంటర్

మహారాణిపేట (విశాఖ): పిల్లలు లేని దంపతులను లక్ష్యంగా చేసుకుని, సరోగసీ (అద్దె గర్భం), ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) కేంద్రాలు భారీగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాయి. మాతృత్వపు ఆనందాన్ని అందిస్తున్న ఈ పద్ధతులను కొన్ని సంస్థలు సొమ్ము చేసుకునే మార్గంగా చూస్తూ మహిళల నుంచి అడ్డగోలుగా డబ్బు దోచుకుంటున్నాయి. గతంలో ఐవీఎఫ్ కేంద్రాలు ఇష్టానుసారం సరోగసీని ఉపయోగించుకుని డబ్బులు దండుకున్నాయని అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. నగరంలోని 'సృష్టి ఐవీఎఫ్' సెంటర్ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. సరోగసీ, ఐవీఎఫ్ సేవలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్గదర్శకాలు రూపొందించి నియంత్రిస్తున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి అనుమతులు పొంది మాత్రమే ఈ కేంద్రాలను నడపాలి. జిల్లాలో 41 ఐవీఎఫ్, 9 సరోగసీ కేంద్రాలు సహా మొత్తం 50 కేంద్రాలు పనిచేస్తున్నట్లు సమాచారం

టెస్ట్ ట్యూబ్ బేబీ

సహజ పద్ధతిలో గర్భధారణ కానివారికి లేదా పురుషులలో వీర్య కణాల నాణ్యత తక్కువగా ఉన్నప్పుడు వైద్యులు ఐవీఎఫ్ పద్ధతిని సూచిస్తారు. సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల్లో ఏఆర్‌టీ (అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ) బ్యాంక్, ఎల్–1, ఎల్–2 విభాగాలు ఉంటాయి. వీటి కోసం వరుసగా రూ. 50వేలు, రూ.50వేలు, రూ. 2 లక్షలు డిపాజిట్/డీడీ సమర్పించాలి. దరఖాస్తుతో పాటు సదుపాయాలు, వైద్యుల వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సమర్పించాలి.

కలెక్టర్ అధ్యక్షతన కమిటీలు

కలెక్టర్ అధ్యక్షతన సరోగసీ, ఐవీఎఫ్ పర్యవేక్షణ కోసం కమిటీలు ఏర్పాటు చేశారు. వీటిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ప్రసూతి, పిల్లల వైద్య విభాగాల అధిపతులు, పోలీసు కమిషనర్, సెషన్స్ జడ్జి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రముఖ గైనకాలజిస్టులు సభ్యులుగా ఉంటారు. సరోగసీకి కలెక్టర్, ఐవీఎఫ్‌కు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది.

'సృష్టి' అక్రమాలు, నిబంధనల ఉల్లంఘన

జిల్లా పరిషత్ సమీపంలోని 'సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్' వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. ఈ కేంద్రం 2018 నుంచి 2023 వరకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో నమోదైంది. ఆ తర్వాత ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండానే అనధికారికంగా నడుస్తోంది. డాక్టర్ నమ్రత ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కేంద్రంపై విశాఖ, విజయవాడ, గుంటూరు, హైదరాబాద్‌లలో కేసులు నమోదయ్యాయి. మేనేజర్ కల్యాణికి ఇందులో కీలక పాత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. గత నెలలో ఈ కేంద్రంలో డెలివరీ అయిన మగబిడ్డ విషయంలో అక్రమాలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. వేరే మహిళకు పుట్టిన బిడ్డను తీసుకువచ్చి సరోగసీ ద్వారా పుట్టినట్లు దంపతులను నమ్మించారు. ఢిల్లీకి చెందిన గర్భిణిని విమానంలో విశాఖకు తీసుకొచ్చి డెలివరీ చేయించారని పోలీసులు అనుమానిస్తున్నారు. డాక్టర్ నమ్రత గతంలో కోట్లాది రూపాయల దందా చేసి, ఒక బిడ్డను రూ.30 లక్షలకు విక్రయించారని పోలీసులు చెబుతున్నారు.

అక్రమ వసూళ్లు, పర్యవేక్షణ లోపం

నగరంలో ఐవీఎఫ్, సరోగసీ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే ఈ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఒక కేసు నుంచి రూ. 20 లక్షల నుంచి రూ. 40 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. డబ్బులు ఎక్కువగా ఉన్నవారి నుంచి వివిధ రకాల ఫీజుల పేరుతో దోచుకుంటున్నారు. వివాహం జరిగి చాలా ఏళ్లు పిల్లలు లేని తల్లుల నుంచి పెద్ద మొత్తంలో అక్రమ వసూళ్లు చేస్తున్నారు. దీనికి ఎలాంటి బిల్లులు, లెక్కలు ఉండటం లేదు. ఈ కేంద్రాలపై వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణ కొరవడుతోందని స్పష్టమవుతోంది.

నమోదు తప్పనిసరి



సరోగసీ, ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) సేవలందించే కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అలాగే నమోదు కోసం నిర్దేశించిన రుసుములను సకాలంలో చెల్లించాలి. రుసుము చెల్లింపులో జాప్యం చేసే దరఖాస్తులను తిరస్కరిస్తాం. అనుమతులు పొందిన తర్వాత మాత్రమే సరోగసీ, ఐవీఎఫ్ ప్రక్రియలను ప్రారంభించాలి. ప్రస్తుతం దరఖాస్తు చేసుకోని ఏఆర్‌టీ సెంటర్లను కూడా సీజ్ చేస్తాం. అటువంటి సెంటర్లకు నోటీసులు జారీ చేసి, వారి సేవలను నిలుపుదల చేసి, ప్రీ–కాన్సెప్షన్ అండ్ ప్రీ–నేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ యాక్ట్ 1994 కింద కఠిన చర్యలు తీసుకుంటాం

–డాక్టర్ పి.జగదీశ్వరరావు, డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

స్మార్టు మీటర్లతో పేదల సంక్షేమానికి ఎసరు



స్మార్టు మీటర్ల వల్ల అనర్థాలపై సీఐటీయూ జిల్లా నాయకుడు శ్రీనివాసరావు ప్రచారం

కశింకోట: ఇళ్లకు స్మార్టు మీటర్లు అమర్చడం పేదల సంక్షేమానికి అనర్థదాయకమని సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు విమర్శించారు. ఆదివారం స్థానిక భవాని కాలనీలో ఇంటింటికి వెళ్లి స్మార్టు మీటర్ల ఏర్పాటు వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. వీటిని అమర్చడాన్ని ప్రజలు వ్యతిరేకించాలన్నారు. అదానీ కంపెనీ వారి స్మార్టు మీటర్ల వల్ల విద్యుత్ బిల్లులు ఇష్టానుసారం పెంచి అధిక ఆదాయంతో లబ్ధి కలుగుతుందన్నారు. అయితే బిల్లులు పరిమితికి మించి రావడం వల్ల పేదలకు అందాల్సిన సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని ఆరోపించారు. పేదల సంక్షేమానికి అవరోధంగా నిలిచే కేంద్ర ప్రభుత్వం చేపట్టిన విద్యుత్ సవరణ చట్టం విధానాలు విరమించుకోవాలన్నారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి.వరలక్ష్మి కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ సేవలకు ప్రశంసాపత్రం



రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న అరుణ

కశింకోట: మండలంలోని సుందరయ్యపేటలో మండల ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం నిర్వాహకురాలు కూండ్రపు అరుణ ప్రశంసా పత్రం అందుకున్నారు. ప్రకృతి వ్యవసాయంపై ఈ కేంద్రంలో రైతులకు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ద్రావణాలు, కషాయాలు తయారీలో సమర్థవంతంగా శిక్షణ ఇస్తున్నారు. దీన్ని గుర్తించి ప్రకృతి వ్యవసాయం ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్ ఇటీవల గుంటూరులో రాష్ట్ర స్థాయి రైతు సాధికార సంస్థ వనరుల కేంద్రం నిర్వాహకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

పెరిగిన టమాటా ధర



అనకాపల్లి టౌన్: టమాటా లేని వంటకం రుచించదు. అందుకే కూరలు, చట్నీలు, ఇలా అనేక వంటల్లో రుచి కోసం వాడుతుంటారు. అంతటి ప్రాధాన్యత ఉన్న ఈ కాయగూర సామాన్యుడికి చుక్కలు చూపిస్తోంది. వారం రోజుల వరకు రూ.25 నుంచి రూ.30 వరకు దొరికే టమాటా ఒక్కసారిగా రూ.20 పెరిగి రూ.50కి చేరింది. ఈ ధరలు పెరగడానికి కారణం శ్రావణమాసం కావడం, ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంట దెబ్బతినడం వల్ల సరఫరా తగి డిమాండ్ పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు.

స్థలాల లీజు ప్రతిపాదన విరమించుకోవాలి

నర్సీపట్నం: ఆర్టీసీ స్థలాలను లీజుకు ఇచ్చే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ఎన్ఎంయూ రీజియన్ అధ్యక్షులు రాజు, డిపో కార్యదర్శి జి.ఎస్.నారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం ఉద్యోగులు రెడ్ బ్యాడ్జీలు ధరించి డిపో గేటు వద్ద ధర్నా నిర్వహించారు. మాల్ స్థలాలకు ఆర్టీసీ స్థలాలను ఇవ్వడం సరైన పద్ధతి కాదన్నారు.

అనకాపల్లి సినిమాలు

రాజా	: ద ఫెంటాస్టిక్
సత్యనారాయణ స్క్రీన్-1	:జూనియర్
సత్యనారాయణ స్క్రీన్-2	హరి హర వీరమల్లు
పర్తిసాయి	: మహావతార్ నరసింహ
షిర్డీసాయి	: హరి హర వీరమల్లు
వెంకటేశ్వర	: హరి హర వీరమల్లు
శ్రీ సత్య	:తమ్ముడు
రామచంద్ర	: హరి హర వీరమల్లు

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 84 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-11, బీ పాజిటివ్-29, ఓ పాజిటివ్-40, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 223 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 201 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

భయపెడుతున్న వంతెన



జి. భీమవరం వద్ద మామిడివాక గెడ్డపై బలహీన పడుతున్న రోడ్లు, భవనాల శాఖ వంతెన



వంతెన నుంచి రాలిన శకలాలు

- ప్రమాదకరంగా మామిడివాక గెడ్డపై వంతెన
- అధిక బరువుతో వాహనాల రాకపోకలు
- రోజురోజుకూ బలహీనపడుతున్న వైనం
- ప్రమాదం పొంచి ఉందని ఆందోళన

కశింకోట: అర్ధ శతాబ్దం క్రితం నిర్మించిన వంతెన వాహనదారులను భయపెడుతోంది. పరిమితికి మించిన బరువుతో నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొంది. మండలంలోని జి. భీమవరం వద్ద మామిడివాక గెడ్డపై ఆర్అండ్‌బీ నిర్మించిన వంతెన రోజురోజుకూ బలహీన పడుతోంది. దీంతో ఏ క్షణాన ఎటువంటి ముప్పు ముంచుకొస్తుందోనని వాహన చోదకులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ముందుగా మేల్కొని ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకుంటే తాళ్లపాలెం-నర్సీపట్నం మధ్య రాకపోకలు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తాళ్లపాలెం నుంచి నర్సీపట్నం వైపు వెళ్లే రోడ్లు, భవనాల శాఖకు చెందిన రహదారిలో మామిడివాక గెడ్డపై జి. భీమవరం వద్ద వంతెనను 1972లో నిర్మించారు. వంతెన దీర్ఘకాలంగా బాగానే ఉపయోగపడుతున్నప్పటికీ కొంత కాలంగా భారీ వాహనాల తాకిడికి బలహీనపడుతోంది. అక్కడక్కడా దెబ్బతిని శిథిలాలు రాలుతున్నాయి. ఈ వంతెనపై నుంచి టిప్పర్లు వంటి భారీ వాహనాలు పరిమితికి మించిన బరువుతో 60 టన్నుల వరకు రాకపోకలు సాగిస్తున్నాయి. మాకవరపాలెం వద్ద పరిశ్రమకు ముడి సరుకులు, రోలుగుంట, ఏజెన్సీ వంటి ప్రాంతాల నుంచి రాంబిల్లి వద్ద నిర్మిస్తున్న పోర్టుకు బండ రాళ్లు టిప్పర్లలో పరిమితికి మించి



వంతెనపై నుంచి భారీ వాహనాల రాకపోకలు

తరలిస్తున్నారు. ఇవి రోజుకు వందలాదిగా తరలిపోతున్నాయి. దీంతో 40 టన్నుల సామర్థ్యం కలిగిన వంతెన వాటి ధాటికి తట్టుకోలేక క్రమేపి బలహీన పడుతోంది. దీంతో ఏ క్షణంలో ఇది కూలిపోతుందోనని, ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని వాహన చోదకులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

శాసనసభ స్పీకర్ పరిశీలన

నిత్యం ఈ మార్గంలోనే ప్రయాణించే శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఇటీవల వంతెన దెబ్బతింటున్న విషయాన్ని తెలుసుకుని పరిశీలించారు. ఇక్కడ పొంచి ఉన్న ప్రమాదం, భవిష్యత్‌లో రవాణాకు ఇబ్బంది ఏర్పడే పరిస్థితి దృష్ట్యా అధిక లోడ్ వాహనాల రాకపోకల నిషేధానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వంతెన స్థితిపై నిపుణులైన ఇంజనీరింగ్ అధికారులతో సాంకేతిక నివేదిక ఆధారంగా అవసరమైతే ప్రత్యామ్నాయంగా వంతెన నిర్మాణానికి, తాత్కాలిక మార్గానికి చర్యలు చేపట్టాలన్నారు.

ఇంజనీరింగ్ నిపుణుల బృందం పరిశీలన..

ఇంజనీరింగ్ నిపుణుల బృందం శనివారం ఇక్కడ వంతెనను పరిశీలించినట్లు అధికారిక సమాచారం. వారి అభిప్రాయం మేరకు నివేదిక ఇవ్వాల్సి ఉంది. ఇందుకు వారం రోజుల వరకు సమయం పట్టవచ్చునని తెలుస్తోంది. ఈ నివేదిక వస్తే దాని ఆధారంగా వంతెన విషయమై చేపట్టాల్సిన ముందు జాగ్రత చర్యలపై స్పష్టత రానుందని సమాచారం. ఈ నేపథ్యంలో అధికారులు కార్యాచరణ రూపొందించి భవిష్యత్‌లో రవాణాకు ప్రధానమైన ఈ మార్గంలో ఎటువంటి ఆటంకం ఏర్పడకుండా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

అనకాపల్లి నుంచి నర్సీపట్నానికి ఇదే ప్రధాన మార్గం

అనకాపల్లి నుంచి నర్సీపట్నం వెళ్లడానికి ఇదే ప్రధాన మార్గం. రోజూ ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, లగ్జరీ, పల్లె వెలుగు బస్సులు విశాఖ, అనకాపల్లి ప్రాంతాల నుంచి నర్సీపట్నం, చింతపల్లి, సీలేరు, భద్రాచలం వంటి ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. లారీలు, వ్యాన్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వందలాదిగా తరలిపోతుంటాయి. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఈ వంతెనకు నష్టం కలిగి రవాణా నిలిచిపోతే నర్సీపట్నం, మాకవరపాలెం ప్రాంత వాసులు, చింతపల్లి, సీలేరు వంటి ఏజెన్సీ ప్రజలు నర్సీపట్నం నుంచి అటు దూరంగా ఉన్న చోడవరం మీదుగా గాని, ఇటు అడ్డురోడ్డు మీదుగా జాతీయ రహదారి నుంచి గాని అష్టకష్టాలు పడి చేరుకోవలసిన పరిస్థితి ఏర్పడనుంది. మండల గ్రామాల ప్రజలు ఆయా ప్రాంతాలకు చేరుకోవాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సిన దుస్థితి. దీంతో వాహన చోదకులు, ప్రయాణికులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వంతెనకు ముప్పు జరగకముందే సత్వరమే ముందు జాగ్రత్త చర్యగా భారీ వాహనాలను నిషేధించాలని, వంతెన బలహీనపడితే ప్రత్యామ్నాయంగా ఇప్పటి నుంచే మరో వంతెన నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇంజనీర్ల బృందం నివేదికతో చర్యలు

జి. భీమవరం వద్ద వంతెనపై నుంచి 40 టన్నులు బరువు సామర్థ్యాన్ని మించి వాహనాలు నడపరాదు. వంతెన స్థితిపై నిపుణులైన ఇంజనీర్ల బృందం తాజాగా పరిశీలించింది. నివేదిక ఇవ్వాల్సి ఉంది. వారిచ్చే నివేదిక ఆధారంగా వంతెనపై భారీ వాహనాల నిషేధానికి తదుపరి చర్యలు చేట్టాల్సి ఉంది.

– నారాయణరెడ్డి, జేఈ, రోడ్లు, భవనాల శాఖ, నర్సీపట్నం డివిజన్

గౌరీపరమేశ్వరుల ఆలయ కమిటీ అధ్యక్షుడిగా వెంకటరావు



గౌరీపరమేశ్వరుల ఆలయ నూతన కార్యవర్గం

అనకాపల్లి: వేల్పులవీధిలో గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా గరికి వెంకటరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక వేల్పులవీధి సీతారామ కల్యాణ మండపం ఆవరణలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఆలయ ప్రధాన కార్యదర్శిగా నానేపల్లి రవి, ఉపాధ్యక్షులుగా పెదిరెడ్ల నాగు, ధరిశెట్టి చిన్న, కార్యదర్శులుగా వి.పాపయ్యశెట్టి, పద్మనాభం శంకర్, కోశాధికారిగా పోతల రమణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గరికి వెంకటరావు మాట్లాడుతూ నూతన కమిటీ ఎన్నిక రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు. వచ్చే నెల 27న గణపతి నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వీధి పెద్దలు వాకాడ బాబు, వేల్పుల గణేష్, మద్దాల కూర్మారావు, గుమ్మాల నాగేశ్వరరావు, బి.ఉమామహేశ్వరరావు, మద్దాల నూకరాజు, వాకాడ నర్సింగరావు, బొద్దపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న పూర్వ విద్యార్థులు

అనకాపల్లి: రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న మరో ముగ్గురు వ్యక్తుల ప్రాణాలను కాపాడవచ్చని మిత్ర అసోసియేటెడ్ ఫర్ సోషల్ సర్వీస్(మాస్) ప్రతినిధులు గుండా సాయి, బొబ్బిలి అప్పలరాజు తెలిపారు. స్థానిక నాయుళ్లవీధి సిటీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాస్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు 16 సంవత్సరాలుగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రక్తం సృష్టిలో దొరకదని, ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తి మాత్రమే అందజేయవచ్చన్నారు. అంతకుముందు జీవీఎంసీ పెద్ద హైస్కూల్‌కు చెందిన 1987-88 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు 35 మంది రక్తదానం చేశారు. రక్తాన్ని విశాఖ ఏఎస్‌రాజా బ్లడ్ బ్యాంకుకు తరలించారు. కార్యక్రమంలో మాస్ సభ్యులు భువనగిరి రామకృష్ణ, భరణి, శివకుమార్, పేరపు రాంబాబు, జిలాని, బాష, కోయిలాడ వెంకటరావు, ఆడారి రవి, వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

శారదానదికి జలకళ



శారదానది నీటి ప్రవాహం

అనకాపల్లి టౌన్: శారదానది జలకళ సంతరించుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరడంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. దీని పక్కనే శారదా పార్కు ఉండడంతో అక్కడికి వచ్చే పిల్లలు, పెద్దలు నది అందాలను తిలకిస్తున్నారు. నది బ్రిడ్జిపై వెళ్లేవారు సాయంత్రం వేళలో కొద్ది సేపు సేదతీరుతున్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టంలో అర్చకులు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన సేవను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర పూజ జరిపారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

విశేషంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలో ఉదయం ఈ సేవను జరిపారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేష హారతులిచ్చారు. పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

నిత్యావసర సరకులు అందజేత



నిత్యావసర సరకులు అందజేస్తున్న శివబాబు తదితరులు

అనకాపల్లి: మండలంలో పరవాడపాలెంలో సారిపల్లి అప్పలనాయుడుకు ఆదివారం దాతలు నిత్యావసర సరుకులు అందజేశారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దాంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన గొంతిన శివబాబు, పందిరి కొండబాబు, బి.రమణ తమ వంతు సహాయంగా వీటిని అందజేశారు. ఆపదలో ఉన్న వ్యక్తులను ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు.

ప్రభుత్వ భూముల్ని కాపాడే బాధ్యత లేదా?



మాట్లాడుతున్న గనిశెట్టి కనకరాజు, చిత్రంలో ఎంపీటీసీ అప్పలరాజు, సంతోష్

పెందుర్తి: 'మన గ్రామంలోని ఐదెకరాల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారు. మేము దానిపై పోరాటం చేస్తున్నాం. ఆ భూమిని కాపాడాలని మా బాధ్యతగా ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశాం. అలా చేశామని మాపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. ఆ భూమిని మీరు కాపాడాలనుకుంటున్నారా.. లేక కబ్జా చేస్తున్న వారికి మద్దతు పలుకుతున్నారా' అంటూ చింతగట్లకు చెందిన టీడీపీ నాయకులు తమ పార్టీకే చెందిన ప్రత్యర్థి వర్గం నాయకులపై విరుచుకుపడ్డారు. ఆదివారం టీడీపీ నేత, అయ్యారక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజు మాట్లాడుతూ సర్వే నెం.81/2లో సుమారు రూ.25 కోట్లు విలువ చేసే ఐదెకరాల భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇది గిట్టని స్థానిక టీడీపీ నాయకుడు చిన్నారావు, ఇతర టీడీపీ నాయకులు తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఎంపీటీసీ సభ్యుడు నందవరపు అప్పలరాజు, స్థానిక నాయకుడు బొట్టా సంతోష్ గ్రామపెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కథల పోటీలో పురస్కారం



మంత్రి పొన్నం ప్రభాకర్ నుంచి బహుమతి అందుకుంటున్న రచయిత బలరామస్వామి

కశింకోట: జాతీయ స్థాయి కథల పోటీలో కశింకోటకు చెందిన కథా రచయిత బొడ్డేడ బలరామస్వామి తృతీయ బహుమతి పొందారు. నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీ పీఠం సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీలో పురస్కారానికి ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్రం ముల్కనూరు సభలో ఆయనకు దుశ్శాలువా కప్పి ఆ రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.10 వేలు, జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ విషయమై బహుమతి గ్రహీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలోనూ బలరామస్వామి రాసిన కీడు గుడెసె, డేగ కథలకు బహుమతులు అందుకోవడంతోపాటు మూడోసారి అదే పీఠం నుంచి బహుమతి లభించడం పట్ల సాహితీ ప్రియులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న క్లబ్ అధ్యక్షుడు జోగినాయుడు

అనకాపల్లి: క్రీడలు ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని, మానసిక ఉల్లాసం కలుగుతుందని బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె.జోగినాయుడు తెలిపారు. ఆగస్టు 3న అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక గవరపాలెం జీవీఎంసీ చిన్న హైస్కూల్ ఆవరణలో క్లబ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు వివిధ రకాలైన క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు క్లబ్ సభ్యుడు, వైద్యుడు డి.డి.నాయుడు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవాధ్యక్షుడు పెంటకోట నర్సింగరావు, చైర్మన్ పి.ఎస్. అప్పారావు, కార్యదర్శి పెంటకోట ప్రభాకర్, కోశాధికారి భర్నికాన శ్రీనివాసరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవు



దేవరాపల్లిలోని ఎరువుల దుకాణంలో నిల్వలను తనిఖీ చేస్తున్న ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి ఎల్.వై. కాంతమ్మ దుకాణదారులను హెచ్చరించారు. మండలంలోని లైసెన్స్ ఎరువుల దుకాణాలను ఆదివారం ఆమె తనిఖీ చేశారు. దేవరాపల్లిలోని హేమ రైతు డిపో, మన గ్రోమోర్, కాశీపురంలోని శ్రీలక్ష్మీనారాయణ, వెంకట రోహిణి లైసెన్స్ ఎరువుల దుకాణాలలో ఎరువుల నిల్వలను పరిశీలించారు. బిల్లు బుక్, స్టాక్ రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ దుకాణాల ఎదుట ఎరువుల ధర పట్టిక ఏర్పాటు చేయడంతో పాటు ఎరువులు కొనుగోలు చేసే ప్రతి రైతుకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని దుకాణదారులకు సూచించారు. రైతు విస్తీర్ణం ఆధారంగా ఎరువులు విక్రయించాలని, ఎరువులు కొనుగోలు చేసే రైతుల నుంచి సంతకాలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రోజు షాపు మూసే ముందు ఎన్ని బస్తాలు నిల్వ ఉన్నాయో స్టాక్ రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో 24 టన్నులు, కలిగొట్ల పీఏసీఎస్‌లో 24 టన్నులు, ప్రైవేటు దుకాణాల్లో 40 టన్నులు మేర ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయంపై కేసు నమోదు

నాతవరం : మండలంలో జిల్లేడుపూడి గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులో మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నామని నాతవరం ఎస్ఐ సిహెచ్. భీమరాజు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామంలో మద్యం విక్రయిస్తున్నట్టుగా మాకు అందిన సమాచారంతో దాడులు చేసి, అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకున్నామన్నారు. నిందితుడి వద్ద నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. మండల వ్యాప్తంగా నిబంధనలు ఉల్లఘించి మద్యం విక్రయించే గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు.

వాహన చోరులతో తస్మాత్ జాగ్రత్త!

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీ, ఎన్టీపీసీ, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు తమ వాహనాలను ఎక్కడిపడితే అక్కడ పార్క్ చేసి విధులకు వెళ్లిపోతున్నారు. తిరిగి వచ్చి చూసే సరికి వాహనాలు కనిపించకపోవడంతో లబోదిబోమంటూ పోలీస్ స్టేషన్‌కు పరుగులు తీస్తున్నారు. ముఖ్యంగా పరవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఆంజనేయస్వామి ఆలయం వెనుక భాగంలో ఖాళీగా ఉన్న ప్రదేశంలో నిత్యం వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలను పార్క్ చేసి విధులకు వెళ్తుంటారు. ఎన్టీపీసీ వద్ద కూడా పార్కింగ్ స్థలం చాలినంత లేకపోవడంతో చెట్ల నీడన వాహనాలను పార్క్ చేస్తున్నారు. ఇదే అదనుగా చేసుకుని వాహన చోరులు వాటిని దొంగిలిస్తున్నారు. మెకానిక్ షెడ్ల వద్ద కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల సినిమాహాలు కూడలి వద్ద ఓ మెకానిక్ షెడ్‌కు రిపేర్ కోసం ఇచ్చిన వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించుకుపోయాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో షెడ్ యజమాని రూ.50 వేలు చెల్లించుకోవాల్సి వచ్చింది. దీనిపై స్థానిక సీఐ మల్లికార్జునరావును వివరణ కోరగా.. పరవాడ ప్రాంతంలో వాహన చోరీలకు పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాలుగైదు నెలలుగా వాహన చోరీలు తగ్గుముఖం పట్టాయన్నారు. భద్రత లేని ప్రదేశాల్లో వాహనాలను నిలపడం శ్రేయస్కరం కాదని హెచ్చరించారు.